ఎంఎస్ఎంఇ ప్లాట్లకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం : పరిశ్రమ నిర్మాణం కోసం ప్రభుత్వం 70 పాట్లును కేటాయించిందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ ప్లాట్ల కోసం ఎపిఐఐసి వెబ్‌సైట్ (www.apiic.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, శ్రీకాకుళం జోన్, ఎపిఐఐసి లిమిటెడ్ జోనల్ మేనేజర్ ఎమ్ మురళీమోహన్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా మన్యంలో జిల్లా సీతంపేట మండలం పనుకువలసలో ఎపిఐఐసి లిమిటెడ్, పనుకువలస వద్ద ప్రభుత్వం నుంచి ఎపిఐఐసికి 27.26 ఎకరాల భూమి లభించింది. పరిశ్రమల నిర్మాణం కోసం ఈ ప్రాంతంలో 70 ప్లాట్లను మంజూరు చేశారు. ఈ ప్లాట్లను పొందగోరు ఆసక్తిగల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎపిఐఐసి వెబ్‌సైట్ (www.apiic.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక యువత, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మింగ మెతకు లేదంటే మీసానికి శంపంగి నూనె రాస్తానన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. అచ్చంగా అలాగే ఉంది మన జిల్లాలోని రోడ్ల అభివృద్ధిపై ఎంపీ, ఎమ్మెల్యేల ప్రచారం తీరు. గుంతలు పూడ్చడం, మరమ్మతు పనులు చేపట్టడం వంటివి చేయాలని ప్రజలు నెత్తీనోరూ కొట్టుకుంటుంటే రహదారులను ఏకంగా నేషనల్ హైవేలుగా మార్చేస్తామంటూ ప్రగల్భాలాలు పలుకుతున్నారు. అవి ఆచరణలో అమలు నోచుకోకపోవడంతో విస్తుపోతున్నారు. జిల్లాలో చాలారోడ్లు గతుకుల మయంగాను, అత్యంత ఇరుకుమయంగాను మారిపోయాయి. ముఖ్యంగా చీపురుపల్లి - రాజాం - పాలకొండ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. వీటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన ప్రజాప్రతినిధులు ఏకంగా జాతీయ రహదారులుగా మార్చేస్తామంటూ ప్రచారం చేస్తున్నారు. వీరి హామీల మాట అటుంచితే జిల్లాలోని పలు రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

దుమ్ములేస్తున్న రాజాం పట్టణంలోని రోడ్డు

రహదారుల అభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితం

- ప్రమాదకరంగా చీపురుపల్లి - రాజాం - పాలకొండ రహదారి
- వీటినే జాతీయ రహదారులుగా మార్చేస్తామని ఎమ్‌పి, ఎమ్మెల్యేల ప్రచారం
- గతుకులమయంగా మరిన్ని రోడ్లు

గోతులమయమైన రాజాం - చీపురుపల్లి రహదారి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం నుంచి చీపురుపల్లి - రాజాం, పాలకొండ రహదారి గడిచిన ఎన్నికలకు ముందే అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై గతుకులు, దూళిదుమ్ము కూడా దిగమింగిన టిడిపి నాయకులు, చివరకు సిఎం చంద్రబాబు ఈ సమస్యను ఎన్నికలతో ముడిపెట్టిన సంగతి తెలిసిందే. తమను గెలిపిస్తే రహదారి అద్దంబిల్లలా చేసేస్తామని హామీలు గుప్పించారు. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే రోడ్డు ఇలా తయారైపోయిందని కూడా విమర్శలు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. ఆర్‌అండ్‌బి అధికారులు ఈ రహదారి మరమ్మతులకు సుమారు 14.71కిలోమీటర్ల పరిధి రహదారికి రూ.6కోట్లు అవసరం కానున్నట్టు ప్రతిపాదనలు పంపినప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఉలుకు పలుకూ లేదని సమచారం. ఫలితంగా రహదారిలో ప్రాయాణించే వారంతా ఒళ్లు నొప్పులతోపాటు శ్వాసకోస సంబంధిత వ్యాధులకు గురైతున్నారు. చిలకపాలెం నుంచి రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా వెళ్లే రాయగడ రహదారి కూడా గతుకుల మయంగా మారింది. ఈ రహదారిలో 19కిలోమీటర్ల పరిధిలో అభివృద్ధి చేసేందుకు రూ.4కోట్లు అవసరం కానున్నట్టు అధికారుల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతునే ఉన్నారు. ఈ రెండు రహదారులనూ ఏకంగా జాతీయ రహదారులుగా మారుస్తామంటూ అవకాశం కుదిరిన ప్రతిసారీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, బొబ్బిలి, రాజాం ఎమ్మెల్యేలు ప్రచారం చేసుకోవడం గమనార్హం. బొబ్బిలి - తెర్లాం రోడ్డులో 4.6 కిలోమీటర్ల పరిధికి రూ.4 కోట్లు, గరివిడి - గర్భాం మధ్య 8.23కిలోమీటర్ల పరిధికి రూ.3కోట్లు, విజయనగరం నుంచి చింతపల్లి వెళ్లే రహదారిలో 15.95 కిలో మీటర్ల పరిధికి రూ.3.90కోట్లు, విజయనగరం నుంచి చిన్నాపురం రహదారిలో 8.4కిలోమీటర్ల దారి అభివృద్ధికి రూ.1.50కోట్లు, రాజాం నుంచి రణస్థలం వరకు 10కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.4కోట్లుతో ప్రతిపాదనలు ఉన్నాయి. భీమసింగి నుంచి కొత్తవలస రహదారిలో 3.5కిలో మీటర్ల పరిధి దారికి రూ.22లక్షలు చొప్పున నిధులు అవసరం కానున్నాయి. ఇవన్నీ రాష్ట్ర రహదారులే. వీటి అభివృద్ధికి రూ.26.62కోట్ల మేర అవసరం. ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే ఈ రోడ్ల అభివృద్ధికి నిధులు రప్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని జనం కోరుతున్నారు.

పాలకొండ రహదారిపై గుంతలు

నత్తనడకన మరికొన్ని రోడ్ల అభివృద్ధి పనులు

కొన్ని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. విజయ నగరం నుంచి భూపాలపురం 7కిలో మీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ.1.75కోట్లు మంజూరయ్యాయి. పినపెంకి నుంచి ఆకులకట్ట వరకు 8.25 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.2.90కోట్లు, విజయనగరంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి బాలజీ జంక్షన్ వరకు 4.5కిలో మీటర్ల మేర పనులకు రూ.3కోట్లు, 42వ జాతీయ రహదారి నుంచి కొంపంగి, జక్కువ మీదుగా పోరాం గ్రామానికి వెళ్లే రహదారిలో సుమారు 3.4కిలో మీటర్ల దారి అభివృద్ధికి రూ.1.80కోట్లు, కైలాం నుంచి జయితి, ఇప్పలవలస మీదుగా కొండలింగాల వలస వరకు ఉన్నదారిలో 6కిలోమీటర్ల మేర పనికి రూ.1.20కోట్లు, కొత్తవలస నుంచి కె.కోటపాడు మీదుగా సబ్బవరం రహదారి 13.4కిలోమీటర్ల అభివృద్ధికి రూ.3.20కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయి. కానీ, ఈ పనులు చురుకుగా ముందుకు సాగడం లేదు. దీనిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సి వుంది.

వరహాల గెడ్డ ఆక్రమణలను తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి- పార్వతీపురం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పట్టణంలో వరహాల గెడ్డ ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో గంగు నాయుడు మాట్లాడుతూ పట్టణ మధ్యగుండా ప్రవహిస్తున్న వరహాల గెడ్డ భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని చెప్పారు. ఈ ఆక్రమణలను తొలగించాలని సిపిఎం ఇప్పటికే అనేక దఫాలుగా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిందని చెప్పారు. ఎట్టకేలకు సర్వేనెంబర్ 410లో ఆక్రమణకు గురై, తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించిన కొంత భాగంలో వేసిన కంచెను తాత్కాలికంగా మున్సిపల్ అధికారులు తొలగించారని తెలిపారు. వరహాల గెడ్డ సర్వేనెంబర్ 410కి సంబంధించిన గెడ్డ పోరంబోకు ప్రాంతాన్ని పూర్తిగా సర్వే జరపాలని, గెడ్డ ఎంత విస్తీర్ణంలో ఉందో హద్దులు నిర్ణయించాలని కోరారు. సమగ్ర సర్వే నిర్వహించి, వరహాల గెడ్డ ఆక్రమణలు తొలగించాలని కోరారు. తొలగించగా ఏర్పడిన ఖాళీ స్థలంలో ఇప్పటికే ట్రాఫిక్ నియంత్రణ పేరుతో తొలగించిన పండ్లు, పువ్వులు, కూరగాయల వ్యాపారం చేసుకునే చిల్లర వర్తకులకు కేటాయించా లని డిమాండ్ చేశారు. లేదంటే విలువైన ఈ భూములు దురాక్రమణకు మళ్ళీ గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం ఈ దిశగా ప్రయత్నాలు చేయకపోతే సిపిఎం ఆధ్వర్యాన భూ పోరాటం నిర్వహించి ఆక్రమణలను తామే తొలగించి పేదలకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకట రమణ, బి.సూరిబాబు, పి.సన్యాసిరావు, బివి రమణ, కె.రామస్వామి, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

కబ్జాదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోండి: కాంగ్రెస్

పట్టణ నడిబొడ్డున ప్రవహిస్తూ ప్రకృతి వరంగా లభించిన వరహాలు గెడ్డను ఆక్రమణదారుల నుంచి రక్షించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఆ పార్టీ ఒబిసి జిల్లా చైర్మన్ వి.దాలినాయుడు, ఎస్‌సి సెల్ చైర్మన్ కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డిని కలిసి వరహాల గెడ్డ కబ్జాలపై చర్చించారు. తక్షణమే వరహాల గెడ్డను పాత రికార్డుల ప్రకారం సర్వే చేయించి, హద్దులు నిర్ణయించాలని కోరారు.

వరహాల గెడ్డను సర్వే చేసి హద్దులు గుర్తించాలి : ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి

పట్టణానికి ప్రకృతి ప్రసాదించిన వరప్రసాదినిలాంటి వరహాల గెడ్డ పోరంబోకు భూమిని తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసిన అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వారణాసి శ్రీహరి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క చంద్రరావు కోరారు. అంతేకాకుండా ఇప్పటికే గెడ్డలోకి వచ్చేసి అనేకమంది అక్రమ నిర్మాణాలు చేపట్టినప్పటికీ మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో వరహాలు గెడ్డ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. ఈ మేరకు వారు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ప్రామాణిక రెవెన్యూ రికార్డుల ఆధారంగా గెడ్డను సర్వే చేసి హద్దులను గుర్తించి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సహకరించిన అధికారులపై చర్య తీసుకోవాలని కోరారు. వరహాల గెడ్డను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం ద్వారా పట్టణానికి ఒక మణిహారంగా మారుతుందని చెప్పారు.

దరఖాస్తులన్నింటికీ ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన ప్రతి దరఖాస్తుకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో డిఆర్ఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో కలిసి అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. రెవెన్యూ అర్జీలను జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, సమర్ధతను పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా, నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రతి శాఖాధికారి తమ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులను సకాలంలో పరిశీలించి సత్వర పరిష్కారం అందించాలన్నారు. అర్జీదారులు పిజిఆర్‌ఎస్ పోర్టల్, మీ సేవా కేంద్రాల ద్వారా తమ సమస్యలను సులభంగా నమోదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు 72 ఫిర్యాదులు వివిధ సమస్యలపై కలెక్టర్ స్వీకరించారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ అర్జీలను పెండింగ్ లేకుండా పూర్తి చేయండి : జెసి

రెవెన్యూకు సంబంధించిన అర్జీలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని రెవెన్యూ క్లినిక్‌ను సందర్శించి రెవెన్యూ వినతులను పరిశీలించారు. పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, న్యాయపరమైన దరఖాస్తుదారులకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలని జేసీ అన్నారు. అలాగే ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాధ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 31 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 31 మంది గిరిజన ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. ఐటిడిఎ ఎపిఒ ఎస్‌వి గణేష్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, డిపిఎం రమణ, డిఇ నాగభూషన్, పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డిఇ రాధారాణి, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, సూపరింటెండెంట్ అప్పారావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

సమస్యలను పరిశీలించి చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటాం : ఎస్‌పి

స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు అంశాల్లో నిజాలు ఉన్నట్లైతే, చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో 14 ఫిర్యాదులు అందాయి. ఎస్పీతో పాటుగా డిసిఆర్‌బి సిఐ ఆదాం, ఎస్సై రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విఒఎలకు, సిసిలకు శిక్షణ

సీతంపేట : మండలంలోని మండల సమాఖ్య పరిధిలో విధులు, ఈ నారీలను గుర్తించి శిక్షణ ఇచ్చారు. పది సంఘాలకు ఒక ఈనారి గుర్తించి వారికి మండల సమైక్య పరిధిలో పుస్తక నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. మన డబ్బులు మన లెక్కలు గురించి తెలిపారు. మీ మండలంలో ఉన్న అన్ని సంఘాలకు శిక్షణ ఇచ్చి పుస్తక నిర్వహణ చేయాలన్నారు. ఈ శిక్షణలో డిపిఎం రమణ కమల కుమారి, ఎంఎంఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రతి పంటకూ మద్దతుధర : మంత్రి

ప్రజాశక్తి- సాలూరు

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

రైతులు పండించిన ప్రతి పంటకూ ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. సోమవారం సాలూరు వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించే అన్ని రకాల పంటలకూ ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించి, వారికి లాభం చేకూరే విధంగా వ్యవహరిస్తుందని తెలిపారు. అందులో ముఖ్యంగా పత్తి, వరి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయడానికి సిద్ధమైందని వెల్లడించారు. పత్తి కొనుగోలును సిసిఐ ద్వారా సాలూరు వ్యవసాయ మార్కెట్‌లో చేపడుతున్నామని రైతులు సిసిఐ ప్రతినిధులు తెలియజేసిన నిబంధనల ప్రకారం ఇక్కడికి పంటను తెచ్చి అమ్ముకోవాలని ఆమె సూచించారు. గోనె సంచులు, లేబర్ ఛార్జీలు వంటి అన్ని రకాల ఖర్చులనూ ప్రభుత్వమే భరించి, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. తూకం పూర్తయిన 24 గంటలలోపు పత్తికి సంబంధించిన నగదును రైతుల ఖాతాలకు నేరుగా అందజేస్తామన్నారు. దీనివల్ల రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగవని, పారదర్శకతతో కూడిన కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని ఆమె హామీ ఇచ్చారు. రైతు నాణ్యమైన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి అమ్ముకొని అధికాదాయం పొందే విధంగా ఈ చర్యలు ఉపయోగపడాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, తహశీల్దార్ నీలకంఠరావు, వ్యవసాయ మార్కెట్ సిబ్బంది, సిసిఐ ప్రతినిధులు, రైతులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నిడగల్లులో నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సీతానగరం : మండలంలోని నిడగల్లులో గల రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మంగళవారం ప్రారంభిస్తారని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున రైతులంతా తమ ధాన్యాలను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకోఎలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 4890 ఎకరాలు కోత జరిగిందని, అందులో 1393 ఎకరాలు పనలపై ఉందని, 2602 ఎకరాలు కుప్పలు రూపంలో ఉందని తెలిపారు. 859 ఎకరాలు నూర్పిడి జరిగి 1529 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని ఎఒ తెలిపారు.

అన్నదాత సేవలో ప్రభుత్వం : ఎమ్మెల్యే

భామిని : గ్రామీణ స్థాయిలో ప్రతి రైతూ పండించిన పంటకు మద్దతు ధర కల్పించి, రైతును ఆర్థికంగా బలోపేతం చేసి, రైతుల అభివృద్ధికి కృషి చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా వ్యవసాయ అధికారుల పనితీరు ఉండాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం భామిని ఎఫ్‌సిఐ గోడౌన్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారుల పనితీరుపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని మొంథా తుపాను నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టపోయిన రైతుల గుర్తింపులో నిర్లక్ష్యం వహించారని, ఈ అంశాన్ని రైతుల సమక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని వ్యవసాయ అధికారులను హెచ్చరించారు. కకీసర గ్రామంలో పంట నష్టపోయిన రైతులని వదిలేసి, పంట నష్టం జరగని రైతుల వివరాలు సేకరించారంటే అధికారుల పనితనం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బిడ్డికి సంధ్యారాణి, టిడిపి మండల అధ్యక్షులు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, సర్పంచ్ లోపింటి రాజేష్, ఏఎంసి కార్యదర్శి వారనాసి సతీష్‌కుమార్, జనసేన అధ్యక్షులు రుంకు కిరణ్, గురిబిల్లి లక్ష్మీపతి, కోరాడ రవణ, బిడ్డికి ప్రసాద్, సోమరాజు గోపాలరావు, అంపిలి కేశవ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టర్లు వైశాలి, జగన్నాథ్

అధికారులకు ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురం

నిత్యం ప్రజలకు సేవలందించే అధికారులు, ఉద్యోగుల ఆరోగ్యం ముఖ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. అందుకోసమే ఈ ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఆసుపత్రిలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవలందించే అధికారులు పనుల ఒత్తిడిలో తమ ఆరోగ్యం గురించి పట్టించుకోరని, తద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, వాటికి సరైన వైద్యమందించడం జరుగుతుందన్నారు. అందుకే జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి సహకారంతో ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య పరీక్షలతో పాటు అభా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరంలో 91 మంది జిల్లా అధికారులు, ఉద్యోగులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారని అన్నారు.

20న మీడియా వారికీ వైద్య పరీక్షలు

ఈనెల 20న గురువారం జిల్లా ఆసుపత్రి క్యాంపస్‌లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆరోగ్య పరీక్షలతో పాటు ప్రత్యేక గుర్తింపు కార్డులు (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు.

పర్యాటకంతో గిరిజన యువతకు ఉపాధి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా పర్యాటకులకు అనుకూలంగా ఉంటుందని రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖా మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. మండలంలోని శిఖపరువు జలపాతన్ని కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డితో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజనుల భాగస్వామ్యంతోనే జలపాతాల వద్ద గిరిజనులే స్వయంగా తమ పరిధిలో దుకాణాల ఏర్పాటు నుంచి మౌలిక సదుపాయాల కల్పన వరకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఇటీవల సీతంపేటలో ప్రారంభించిన 'టూరిజం స్టార్ట్స్ ఇన్' కార్యక్రమం నుంచి పర్యాటకానికి భారీ స్పందన వస్తోందని తెలిపారు. ఈ ప్రాంత సహజ సిద్ధమైన అందాలను వీక్షించడానికి ఇతర జిల్లాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివస్తున్నారన్నారు. జిల్లాలో మరిన్ని జలపాతాలను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఈ జలపాతాల వద్ద పర్యాటక వసతుల కల్పనలో గిరిజనుల భాగస్వామ్యం ముఖ్యపాత్ర వహిస్తోందన్నారు. గిరిజనుల ఆధ్వర్యంలోనే ఇక్కడ షాపుల ఏర్పాటుతో పాటు అన్ని మౌలిక సదుపాయాల కల్పన జరిగిందని, పర్యావరణానికి భంగం కలగకుండా సహజంగా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేశామని, గిరిజన ప్రాంతాల స్వచ్ఛత ఇక్కడ ప్రతిభింబిస్తుందని మంత్రి తెలిపారన్నారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులందరికీ ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, వెలుగు సిబ్బంది, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, పర్యాటకులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో గ్రామస్తుల ఆగడాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ కాలేజీకి సంబంధించిన వ్యవసాయ క్షేత్రంలో సమీపాన ఉల్లి భద్ర గ్రామస్తుల ఆగడాలు అరికట్టాలని కోరుతూ కాలేజీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలేజీ డీన్ డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన విద్యార్థులు, సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలేజీకి 30 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ క్షేత్రం ఉందని, దాని పక్కనే గల ఉల్లిభద్ర గ్రామస్తులు బహిర్భూమికి వెళున్నారని చెప్పారు. దీనివల్ల తాము వ్యవసాయ క్షేత్రంలో అధ్యయనానికి తీవ్ర ఆటంకం కలుగుతోందని చెప్పారు. గ్రామస్తులకు ఎన్నిసార్లు హెచ్చరించినా పట్టించుకోకుండా బహిర్భూమికి వెళ్తున్నారని చెప్పారు. వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన షెడ్‌ను గ్రామస్తులు కూల్చేశారని ఫిర్యాదు చేశారు. వ్యవసాయ క్షేత్రం రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

రైతులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ఎక్కడా ప్రారంభించలేదు. దీంతో రైతులు నూర్పులు చేసిన ధాన్యాన్ని రోడ్లపై టార్పాన్లను కప్పి దాచుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. తుఫానులతో చేతికి వచ్చిన పంట నీటిలో మునగ్గా, మిలిన పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మిగిలిన పంట అమ్ముకునేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎప్పుడు ఏర్పాటు చేస్తారని రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలో సుమారు 18వేల నుంచి 20వేల ఎకరాల్లో వరి సాగైంది. రైతులు వరి పంటను యంత్రాలతో కోయించి నూర్పులు చేసి ధాన్యం రోడ్డుపై ఆరబెట్టారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులకు తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని అనేక గ్రామాల్లో 85 కేజీల ధాన్యం బస్తా రూ.1350 నుంచి రూ.1430కు దళారీలకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతేకాకుండా ధాన్యాన్ని నూర్పుడి యంత్రంతో నూర్పు చేసిన రైతులు వెంటనే వాటిని లైసెన్స్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, లేకుంటే ఈనెల 20 నుంచి ఆందోళన చేస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు.

న్యాయ వ్యవస్థపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులకు న్యాయవ్యవస్థపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కురుపాం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్పిన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో భాగంగా చట్టాలు, వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కళాశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని వెంకంపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తి సోమవారం సందర్శించారు. ముస్తాబు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రత గురించి వివరించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలపై కూడా ఆరా తీశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. దీంతో పాటు ఎంఇఒ సోంబాబు, హెచ్‌ఎం బొత్స వెంకటరమణ, నిమ్మక భాస్కరరావు, పరంకుసునాయుడు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుష్టు వ్యాధి నిర్ములనపై విద్యార్థులకు అవగాహనా కల్పించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 17 నుంచి 30 వరకు ఆశా, ఎఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహించి ఇంటిలో ప్రతి ఒక్కరికీ మచ్చలను పరిశీలించి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అనుమానిత కేసులను పిహెచ్‌సికి రిఫరల్ చేయాలని వైద్యాధికారులు తెలిపారు. అలాగే బలిజిపేట గొల్లవీధిలో కుష్ఠు వ్యాధి సర్వేను ఆమె పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో చిలకలపల్లి లెప్రసీ ఫౌండేషన్ డిపిఎం ఒ.మూర్తి, హెల్త్‌సూపర్‌వైజర్ జి. నాని, ఆరోగ్య సహాయకులు పి.ఉమా మహేశ్వరరావు, ఎఎన్ఎంలు వేద, సుమ, ఆశాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంపై దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజా దర్బారులో ప్రజలు ఇచ్చిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఉన్న టిడిపి పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బారు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా నియోజకవర్గంలో రోడ్ల ఏర్పాటు, భూ ఆక్రమణలు, రెవెన్యూ, విద్యుత్ సమస్యలు, ఇంటి స్థలాలు, పక్కా ఇండ్ల, పింఛన్ల తదితర అంశాలపై పలువురు అర్జీల రూపంలో ఎమ్మెల్యేకి తెలియజేశారు. ప్రజా దర్బారులో ప్రజలు ఇచ్చిన అర్జీలు, ఫిర్యాదు పత్రాలను పరిశీలించి, సంబంధించిన శాఖ అధికారులకు అందజేసి, వెంటనే పరిష్కరించేందుకు దృష్టి పెట్టాలని ఆదేశించారు.

రహదారిపై గోతిలో కూర్చుని నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

గోతులు కప్పకపోతే ఆందోళన

ప్రజాశక్తి - కొమరాడ

ఈ నెలాఖరు నాటికి అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను కప్పకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. సోమవారం పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి అర్థం కోటిపాం వద్ద ఏర్పడిన గోతులను పరిశీలించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి నిరసన కార్యక్రమాలు చేస్తుంటే అధికారులు నిధులు మంజూరయ్యాయి పనులు చేస్తామని కాలయాపన చేస్తున్నారు తప్ప గోతులు మాత్రం కప్పడం లేదన్నారు. దీంతో గోతులు పెద్దవిగా మారి అనేక ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయని ఆవేద వ్యక్తం చేశారు. ఈ నెల 29వ తేది కళ్ళ రహదారి పైన గోతులు కప్పకపోతే 30వ తేదిన పెద్ద ఎత్తున మండలం కేంద్రంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

జన్ని తిరుపతి వర్ధంతి సభ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దుగ్గేరు దివంగత కామ్రేడ్ జన్ని తిరుపతి వర్ధంతి సభను రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రైతు కూలీ సంఘం అధ్యక్షులు సింహాద్రి, ఝూన్సీ మాట్లాడుతూ భూ పోరాటంలో మరణించిన తిరుపతి ఆశయాలకు అనుగుణంగా గిరిజన ప్రజలు స్వేచ్ఛగా బతకాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, కార్యవర్గ సభ్యులు శ్రీను నాయుడు, ఊయక ముత్యాలు, ఆసరి చెంచు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలపై 19న వర్క్‌షాప్

ప్రజాశక్తి - సీతంపేట

జీవనోపాధి అవకాశాలు, స్వయం ఉపాధి పథకాలు, అర్హత ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు ఈనెల 19న సీతంపేట ఐటిడిఎ మీటింగ్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వివిధ జీవనోపాధి కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాలు, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన బ్యాంకు రుణం, రాయితీలపై ఆసక్తి కలిగిన గిరిజన యువతీ, యువకులకు అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పిఒ పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపునకు పదో తరగతి నుంచి పిజి వరకు విద్యార్హత కలిగిన వారు తమ ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, పాస్ పోర్ట్ ఫోటోస్ తో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమానికి పాలకొండ, పాతపట్నం ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు, ప్రాజెక్ట్ డైరెక్టర్, శ్రీనిధి ఎజిఎం అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

పారమ్మకొండ అభివృద్ధికి కృషి

మంత్రి ఆధ్వర్యాన శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రముఖ పర్యాట కేంద్రమైన పారమ్మ కొండ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని పనుకువలస పంచాయతీ చీపురువలస సమీపాన గల పారమ్మకొండ వద్ద శివపార్వతుల కల్యాణం సాలూరు పట్టణానికి చెందిన కొల్ల అజయ్ కుమార్, చెల్లూరు పోలయ్య, పాపిరెడ్డి రమణ. బోను సత్యనారాయణ దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ యాత్రికుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పించామని, జాతీయ రహదారి నుంచి పారమ్మ కొండ వరకు పక్కా రోడ్డు నిర్మించామని తెలిపారు. అలాగే పారమ్మ కొండ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కల్యాణం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాలూరు సిఐ రామకృష్ణ, పాచిపెంట ఎస్సై వెంకట సురేష్ ఆధ్వర్యంలో సుమారు 40 మంది సిబ్బందితో పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్, సాలూరు పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, చీపురుపల్లి సర్పంచ్ సీతారాం, పలువురు నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పార్వతీపురం మనందరి లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వచ్ఛ పార్వతీపురం మనందరి బాధ్యత, పట్టణాన్ని సుందరీకరించడానికి ప్రతి ఒక్కరు నా ఊరు నా బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ ఎ.ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పంచాయతీలు, గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛతపై అవగాహనా కల్పించాలని సూచించారు. నా ఊరు- నా బాధ్యత కార్యక్రమం చేపట్టి ఊరులోని రోడ్లపై చెత్త వేయకుండా కృషి చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ చెప్పారు. అదే విధంగా వీధులకు సిసి రోడ్లు వేస్తే అందంగా ఉంటాయని, మట్టి రోడ్లు ఉండే చోట్ల శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం గ్రామ ప్రజలకు, యువతకు అలవాటు చేయాలని పేర్కొన్నారు. నా ఊరు నాది... నా బాధ్యత అంటుకుంటామనే ప్రతిజ్ఞ చేయాలని కోరారు. దుకాణాల వద్ద ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు పడేయకుండా దుకాణదారులదే బాధ్యత వహించాలని కలెక్టర్ తెలిపారు. శుభ్రతలేని దుకాణాల లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి మండలంలో రెండు గ్రామాలకు ఐఎస్ఒ సర్టిఫికెట్లు రావాలంటే కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని, అప్పుడే ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహిస్తారని చెప్పారు. రికార్డులు పక్కాగా ఉండాలని, ప్రతి కార్యాలయంలోనూ గ్రీవెన్స్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు స్వచ్ఛ పార్వతీపురం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని కలెక్టర్ కోరారు. మున్సిపాలిటీ, పంచాయతీ, గ్రామ వార్డు సిబ్బంది వారం రోజుల్లో మీ పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వారం నుండి తాను ప్రతి గ్రామంలోనూ పర్యటిస్తానని పరిసరాలు శుభ్రంగా లేని పక్షంలో ప్రత్యేక అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో డాక్టర్ వరుణ్ సాయి ప్రతిభ

పాలకొండ: పట్టణానికి చెందిన వైద్యులు కొట్టిశ వరుణ్‌సాయి ఎయిమ్స్‌లో ప్రతిభ చూపాడు. ఈనెల 9న విశాఖలో జరిగిన ఎయిమ్స్ ప్రవేశ పరీక్షలో జాతీయస్థాయిలో 1380వ ర్యాంకు సాధించాడు. వరుణ్ సాయి ఎంబిబిఎస్‌ను 2025లో శ్రీకాకుళం రిమ్స్‌లో పూర్తి చేశాడు. జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించడం ద్వారా తన కలను సాకారం చేసుకున్నాడు. తండ్రి కొట్టిశ రాజశేఖర్ మెడికల్ షాపు నిర్వహిస్తూ ఉన్నారు. తన కుమారుణ్ని వైద్యునిగా చూడాలని చిన్నతనం నుంచి కష్టపడి చదివించారు. తల్లి సత్యవతి నగర పంచాయతీ మెప్మా విభాగంలో పనిచేస్తున్నారు.

19న పరిశుభ్రతపై శిక్షణ

వీరఘట్టం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 19న పచ్చదనం - పరిశుభ్రత కలిగిన గ్రామపంచాయతీల అంశంపై 2025- 26 ఆర్థిక సంవత్సరం సంబంధించి డిపిఓ-5పై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఎస్‌టి కమిషన్ మెంబర్‌గా ప్రమాణ స్వీకారం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఇరిడి ఎంపిటిసి, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు ఎస్‌టి కమిషన్ సభ్యులుగా విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎస్‌టి కమిషన్ చైర్మన్‌గా సొర్ర బొజ్జిరెడ్డితో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. కూటమి ప్రభుత్వంలో ఈ అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోడీకి, సిఎం నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలిపారు.

కవి సమ్మేళనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు స్వాతంత్ర ఉద్యమం, తిక్కన, ఎర్రన, రామకృష్ణ కవుల సమ్మేళనంపై అవగాహన కల్పించారు. వారు రచించిన కవితలు, పద్యాలను విద్యార్థులతో చదివించారు. మంచి, మంచి పుస్తకాలు చదవడం ద్వారా భవిష్యత్తులో మంచి కవులు, రచయితలుగా ఎదగడానికి వీలుంటుందని గ్రంథాలయాధికారి బి.సుకన్య అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సుధా ఉన్నారు.

మూడు ప్రాంతాల ప్రగతే కూటమి లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విశాఖపట్నం వేదికగా ఈనెల 14, 15న నిర్వహించిన సిఐఐ సమ్మిట్ సూపర్ హిట్‌గా ముగిసిందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సాధన సిఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. సిఐఐ సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.13.25 లక్షల కోట్లు పెట్టుబడులు, 613 ఒప్పందాలు, 16 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడంలో చారిత్రాత్మక అడుగులు వేయబడ్డాయన్నారు. ఇప్పటికే గూగుల్ రాకతో విశాఖపట్నానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. సిఐఐ సదస్సు ద్వారా వైజాగ్ ఖ్యాతి మరింతగా పెరిగిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ వ్యూహాత్మకంగా చేసిన కృషికి ఈ సదస్సు ప్రతిఫలంగా నిలిచిందన్నారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన సిఎం, మంత్రి నారా ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలిపారు. విలేకరుల సమావేశంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కెవి కొండయ్య, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, రామారావు, సురేష్, హితీష్ కుమార్, బాలు, మనోహర్, సాయి తదితరులు ఉన్నారు.

గేట్ వే ఇండియాగా విశాఖ : ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్: విశాఖపట్నం త్వరలో గేట్ వే ఇండియాగా మారనుందని స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. విశాఖలో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించిన సిఐఐ ఎపి 30వ భాగస్వామ్య సదస్సులో పాల్గొని వచ్చిన సోమవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటి మంత్రి లోకేష్ సారథ్యంలో జరిగిన సిఐఐ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు వివిధ రంగాల ప్రతినిధులు తరలివచ్చి కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో సుమారు రూ.13లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే 613 ఒప్పందాలతో సుమారు 17 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. అయితే సిఎం ఈ లక్ష్యాన్ని రూ.20 లక్షల కోట్లకు పెంచి రానున్న ఐదేళ్లలో 50 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారన్నారని అన్నారు. విశాఖతో పాటు రాయలసీమను కూడా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఎన్నో ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా మంత్రి లోకేష్ ఎంతోకాలంగా ప్రయత్నాలు సాగించారని, ఆయన కృషి ఫలితంగానే విశాఖపట్నం అభివృద్ధి చెందనుందని అన్నారు. అనంతపురంలో హార్టికల్చర్, ఫుడ్ పార్క్, రాయలసీమలో డ్రోన్ ఎలక్ట్రానిక్ సిటీ, విశాఖపట్నంలో డేటా సెంటర్లు, పార్వతీపురంలో ఐదు ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటుకు ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందించిన విశాఖ డెయిరీ యాజమాన్యం

ప్రజాశక్తి - పార్వతీపురం

బలిజిపేట మండలం వంజరంపేట, చినవంతరాం గ్రామాల్లో గల మహిళా సహకార సంఘాలకు చెందిన 34 మంది మహిళా రైతులు ప్రతిరోజూ సుమారు 160 లీటర్ల పాలను విశాఖ డెయిరీకి సరఫరా చేస్తున్నాయి. అయితే ఇటీవల ఇటీవల విశాఖ డైరీ యాజమాన్యం మహిళా డెయిరీ సహకార సంఘాల ద్వారా పాలు సరఫరా చేస్తున్న రైతులకు లీటరు పాలకు రూ.2 చొప్పున తగ్గించేసింది. దీంతో మహిళా సంఘాల మహిళలు కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డికి తమ గోడు విన్నవించుకున్నారు. సమస్యపై తక్షణమే స్పందించిన కలెక్టర్ విశాఖ డెయిరీ యాజమాన్యంతో చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో యాజమాన్యం రైతులకు తగ్గించిన రూ.2తో పాటు అదనంగా లీటరుకు 0.60 పైసలు పెంచి పాలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేసిన సహాయానికి కృతజ్ఞతగా మహిళా డెయిరీ సహకార సంఘాల మహిళా రైతులు సోమవారం పిజిఆర్ఎస్ సమావేశ మందిరానికి వచ్చి జిల్లా కలెక్టర్‌కు దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మధరావు, బలిజిపేట మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి.గణేష్, డాక్టర్ శంకరరావు, మహిళా డెయిరీ సహకార సంఘాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంపై దాడి అమానుషం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అనంతపురం జిల్లా హిందూపురం నియోజకవర్గం వైసిపి కార్యాలయంపై టిడిపి నాయకులు, కార్యకర్తలు చేసిన దాడిని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న హిందూపురం వైసిపి కార్యాలయంపై టిడిపి నాయకులు చేసిన దాడిని తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపి కార్యాలయంపై టిడిపి గూండాలు పన్నిన దాడి అత్యంత హేయమైనదని, రాజకీయాల్లో అసహనానికి ఇది నిదర్శనని, దాడికి పాల్పడిన వారిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు తన పద్ధతిని మార్చుకొని రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఉండేలా చూడాలి తప్ప ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే కార్యక్రమం చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు, పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, సీతానగరం జడ్పిటిసి మామిడి బాబ్జి, వైస్ ఎంపిపి బి.రవికుమార్, పార్టీ ప్రతినిధులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

మండలంలోని మరికి పంచాయతీ కొత్త ఊరు గ్రామానికి చెందిన గిరిజన యువకుడు మండంగి భాస్కరరావు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, భాస్కరరావు కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మృతి చెందిన గిరిజన యువకుడు మండంగి భాస్కర్ రావు భార్య, బిడ తో కలిసి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యానికి బానిసైన మండంగి భాస్కరరావును మద్యానికి దూరం చేస్తామని, ఆరోగ్యంగా పంపుతామని నమ్మబలికి ఒక స్వచ్ఛంద సంస్థ పార్వతీపురం వైకెఎం కాలనీలో ఒక గృహం ఏర్పాటు చేసిందని, ఆ కేంద్రంలో మూడు రోజుల క్రితం చేరిన భాస్కరరావు శనివారం ఉదయం మృతి చెందాడని వివరించారు. అయితే మృతిపై కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మృతుడి భార్య జయంతి మాట్లాడుతూ తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, ఏం జరిగిందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి దిక్కు ఎవరని కలెక్టర్ ముందు కన్నీరు పెట్టుకున్నారు. మృతుడు పేద గిరిజన యువకుడని, వివాహం జరిగిందని, ఒక వికలాంగ ఆడ బిడ్డ కూడా ఉందని, ఆ పేద గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత, కాంగ్రెస్ నాయకులు వంగలి దాలినాయుడు, తీళ్ల గౌరీశంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో ఉన్న 24, 25, 26 వార్డులకు సంబంధించి రెడ్డి వీధి చివర ఉన్న శ్మశాన వాటికకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం ఆయా వార్డుల స్థానిక ప్రజలు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా రెడ్డి వీధి చివర ఉన్న శ్మశానవాటికలో ఎలాంటి మౌలిక సదుపాయాలూ లేనందున, పలుమార్లు అధికారులు, కౌన్సిలర్ల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదన్నారు. చాలాసార్లు మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఈ శ్మశానవాటికను సుమారు పది వీధులకు సంబంధించిన ప్రజలు ఉపయోగిస్తున్నారని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమస్యని త్వరలోనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చందక అనీల్,

కలెక్టర్‌తో మాట్లాడుతున్న నాయకులు, వార్డు సభ్యులు

24, 25, 26 వార్డు నాయకులు మీసాల కూర్మ, బూర్లి కొండ, నడిపిల్లి గణపతి, అట్టడ రాజు, పల్లి గంగ, నెయ్యిగాపుల సంతోష్, నేరెడుబిల్లి గౌరీ, కునుకు ప్రసాద్, బూర్లి వెంకటేష్, రెడ్డి వీధి, నాయుడు వీధి, బుగత వీధి, బొగ్గుల వీధి, గొర్లి వీధి, వేమకోటవారి వీధికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

మావుడి సోదరులకు మాతృవియోగం

ప్రజాశక్తి - మక్కువ

సంతాపం తెలిపిన రాజన్న దొర

మన్యం జిల్లా అరకు పార్లమెంట్ వైసిపి రాష్ట్ర కార్యదర్శి, మక్కువ జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాసరావు, వైసిపి మండల నాయకులు మావుడి రంగునాయుడు, మక్కువ పిఎసిఎస్ మాజీ చైర్మన్ తిరుపతినాయుడులకు మాతృవియోగం కలిగింది. వారి తల్లి మావుడి అరుణమ్మ (89) సోమవారం తెల్లవారు జామున వృద్ధాప్యంతో పాటు అనారోగ్య కారణాలతో మృతి చెందారు. మావుడి అరుణమ్మ భౌతికాయాన్ని సందర్శించి ప్రగాఢ సంతాపాన్ని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర వ్యక్తం చేశారు. అరుణమ్మ పార్థివ దేహాన్ని సాలూరు పార్వతీపురం నియోజకవర్గాల నుండి పలువురు నేతలు బంధువులు మండలంలోని వివిధశాఖల అధికారులు ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించి నివాళులర్పించారు.

అరుణమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రాజన్నదొర

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : డిఇఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి పాఠశాలలో ముస్తాబు కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి డి.రాజ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో సోమవారం ఆయన సందర్శించారు. భద్రగిరి పిటిజి, గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్తాబు కార్యక్రమం అమలు తీరుపై పరిశీలించారు. ముస్తాబు కార్యక్రమంతో విద్యార్థులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ, మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలి అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులు ప్రయోగాలను ఏ మేరకు నేర్చుకున్నారనే దానిపై ప్రశ్నలు వేశారు. పౌష్టిక ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ పర్యటనలో ఎంఇఒలు చంద్రశేఖర్, భీముడు ఉన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న డిఇఒ రాజ్‌కుమార్

సీతంపేటలో బాలల వారోత్సవాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఈనెల 14నుంచి 20 బాలల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు సిడిపిఒ బి.సింహాచలమ్మ తెలిపారు. బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని విద్యార్థిలంతా పౌష్టికాహారం తీసుకుంటూ ఉల్లాసంగా, సంతోషంగా ఉంటూ ఆటలో పాటలు పాడుతూ ఉంటూ మంచిగా చదువుకోవాలని సూచించారు. బాలల సంరక్షణ జిల్లా అధికారి అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ దత్తత మాసోత్సవాలు సందర్భంగా జిల్లాలోని పిల్లలు లేని తల్లిదండ్రులు దత్తత ప్రక్రియ గూర్చి వివరించారు. జిల్లా లీగల్ ఆఫీసర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ బాలికలంతా అభివృద్ధి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికలే ప్రథమ స్థానంలో ఉండాలని ఆరోగ్యంగా, పౌష్టికాహారం తీసుకోవాలని, లింగ వివక్షకు గురికాకుండా బాలికలు ప్రథమంగా ఉండి మహిళ సాధికారత సాధించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు, కెజిబివి ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతు సేవా కేంద్రాలు ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ సిహెచ్ ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని శివిని సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సొసైటీలతో పాటు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపిటిసి, అరకు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు మాట్లాడుతూ ప్రతి రైతుకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పోట్నూర్ కుమారి, సొసైటీ డైరెక్టర్ సభ్యులు, టిడిపి నాయకులు పి.వెంకట నాయుడు, వైసిపి నాయకులు కె.మల్లిబాబు, సర్పంచులు ప్రజాప్రతినిధులు రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలకు రోడ్లు నిర్మించాలి

పార్వతీపురం: జిల్లాలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో గల అనేక మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు లేక స్థానిక గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, కావున ఆయా గ్రామాలకు రోడ్లు నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.రామస్వామి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రోడ్లు లేక గిరిజనులు తమ అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను మైదాన ప్రాంతానికి రవాణా చేసుకోలేకపోతున్నారని, కాలినడకన బరువును మోసుకుంటూ రావాల్సిన పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గిరిజనులు ఆసుపత్రులకు వెళ్లడం కూడా ఇబ్బందిగా మారుతోందని చెప్పారు. వెంటనే రోడ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు, చెరువులు, వాగులు, గెడ్డల నుంచి జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలు, రవాణాపై ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. కాంట్రాక్టర్‌లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు అధికారుల అనుమతి లేకుండా వందలాది లోడ్లు తరలిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. వరుసగా వచ్చిన ఫిర్యాదులతో చివరకు స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపంలో గ్రావెల్‌ను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రెండు ట్రాక్టర్లు సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయానికి అప్పగించామని అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోట దుర్గాదేవి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని కోటదుర్గా దేవి ఆలయంలో సోమవారం చోరీ జరిగింది. ఎప్పటిలాగే ప్రతిరోజు దీపం పెట్టేందుకు అర్చకుడు సోమవారం దేవాలయానికి చేరుకున్నాడు. తాళాలు పగలగొట్టి దుర్గాదేవి మెడలను తులం శతమానం, రెండు తులాల వెండి, హుండీలో ఉన్న రూ.1000 చోరీకి గురైనట్టు స్థానిక పోలీసులకు తెలిపారు. ఎస్ఐ జి.కళాధర్ సిబ్బంది కోట దుర్గాదేవి ఆలయానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. పాలకొండ నుంచి క్లూస్ టీం కూడా చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరా, సిస్టం కూడా పగలగొట్టారు. ఆలయ కమిటీ సభ్యులు జామి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీ కేంద్రాల్లో సమయపాలన పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఐసిడిఎస్ సిడిపిఒ జి.రజిని దుర్గ సూచించారు. సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగనవాడీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో సమయపాలన పాటించి, ప్రభుత్వం సూచించిన యాప్‌ల్లో ఎటువంటి పెండింగ్ లేకుండా నిరంతరంగా నమోదు చేయాలని, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో 'ముస్తాబు కార్యక్రమం'లో భాగంగా అద్దం, దువ్వెనలు, పౌడర్ తదితర వస్తువులు ఏర్పాటు చేసి, పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. పిల్లల బరువు, ఎత్తు కొలిచే విధానంపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అనంతరం టాటా ట్రస్ట్ (విజయవాహిని చారిటబుల్ ట్రస్ట్) ఆధ్వర్యంలో 124 డిజిటల్ వెయింగ్ మెషిన్లను అవసరమైన అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేశారు. సమావేశంలో సూపర్వైజర్లు, టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ చక్రధర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురంలో సోమవారం జరిగిన వారాపు సంతను స్థానిక ఎస్సై ఎ.నీలకంఠరావు సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనులు కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత లింకులు, మోసపూరిత కాల్స్ నుంచి జాగ్రత్తగా ఉండాలని, మత్తు పదార్థాలు వ్యక్తికే కాదు కుటుంబాలకు కూడా అనర్థాలు తెస్తాయని కావున వాటికి బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎస్‌పి ట్రైనింగ్ ఆర్ ఎస్సైలు పాల్గొన్నారు.